క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం పూర్వాభాద్ర నక్షత్రం దశమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

23న మెగా జాబ్‌మేళా

అద్దంకి రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అద్దంకి ప్రభుత్వం పాలిటెక్నిక్ సయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ శుక్రవారం శింగరకొండ రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజరేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించు కోవాలని కోరారు. వివరాలకు 9440635677, 9949914337 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

సమాచారం కోసం మాజీ సర్పంచ్ దరఖాస్తు

బల్లికురవ: ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న పనులు, కూలీల మస్టర్లపై వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా మల్లాయపాలెం మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ బుధవారం దరఖాస్తు చేశారు. మల్లాయపాలెం పంచాయతీలోని కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లో గత ఏడాది ఆగస్టు ఆరు నుంచి ఈ నేడాది మే 13 వరకు నిర్వహించిన పనులకు సంబంధించి కూలీల మస్టర్లు, ఏయే పనులకు గ్రామ పంచాయతీ తీర్మానాలు ఇచ్చిందో నకళ్లు తమకు అందజేయాలని ఆ పథక ఏపీవోజీ రమాదేవికి దరఖాస్తు సమర్పించారు.

ఆటలతో మనో వికాసం



ఆటలు నేర్పుతున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు(అద్దంకి): క్యారమ్స్, చెస్ వంటి ఆటలతో విద్యార్థుల్లో మేధో వికాసం కలుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ఆయన విద్యార్థులకు క్యారమ్స్, చెస్ ఆటల్లో తర్ఫీదు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదవుతోపాటు, ఆట పాటలు నేర్చుకోవాలని చెప్పారు. దాని వలన విద్య కూడా బాగా వస్తుందని చెప్పారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో విజేతలు

చీరాల: జీవ వైవిధ్య సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఫ్యాకల్టీ పి.భానుచంద్రమూర్తి జీవవైవిధ్య సంరక్షణపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. నీతికథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు వారిచే చదివించి మరలా చెప్పించారు.

శిక్షణ తరగతులకు విద్యార్థులను వారి తల్లిదండ్రులు పంపించాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ కోరారు.

ఎండల్లో వానలు.. జనాల బాధలు

- అకాల వర్షంతో రోడ్లన్నీ జలమయం
- వరుస వానలతో ఉక్కిరిబిక్కిరి
- పిడుగుపాటుకు ఇప్పటికే మూడు పశువులు మృతి



చీరాలలోని పెద్ద చర్చి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

చీరాల: రుతు పవనాలు ముందే రావడంతో కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనం స్తంభించిపోతోంది. గత మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. శనివారం నుంచి పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడ్డాయి. దీంతో పట్టణ, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని మసీదు సెంటర్, పేరాల మార్కెట్, సురేష్ మహల్, దర్బార్ రోడ్, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సెంటర్లలో కొద్దిపాటి భారీ వర్షానికే మోకాటి లోతు నీరు చేరింది. మురుగు కాలువల్లో పూడిక ఎక్కువగా ఉండడంతో నీరు పారుదల లేక సీసీ రోడ్లపై కూడా వర్షపునీరు ఉబికి పొర్లుతోంది. ఎప్పుడు వర్షం వచ్చినా స్థానికుల బాధ వర్ణనాతీతంగా మారింది. గంట పాటు భారీ వర్షం కురిస్తే రోడ్లన్నీ చెరువుల్లో మారిపోతున్నాయి.

ఎవరికి చెప్పుకోవాలి?

గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత నెల రోజులుగా భానుడి ఉగ్రతాపానికి బెంబేలెత్తిన ప్రజలు ఆ తర్వాత మూడు రోజుల పాటు కురిసిన వర్షం కాస్తంత ఉపశమనం కలిగించినా వర్షం నీరు పారుదల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మసీదు సెంటర్‌లోని డ్రైయిన్లలో పూడిక తీయకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఇటీవల కురిసిన వర్షానికి వర్షం నీరు పారుదల లేక ఇబ్బందులు పడటంతో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పొక్లెయిన్‌తో ప్రధాన డ్రైన్‌లోని పూడికను తొలగించారు. చీరాల పట్టణంలో నుంచి వచ్చే మురుగునీటి కాలువల ద్వారా మసీదు సెంటర్‌లోని ప్రధాన డ్రైన్ ద్వారా కుందేరులోకి చేరుతోంది. కుందేరు కాలువలో పూడిక తీత పనులు గతంలో చేపట్టినా గుర్రపు డెక్క పెరిగిపోయి పారుదలకు అడ్డంకిగా మారింది. అలానే కుందేరు కాలువ ఆక్రమణలకు గురికావడంతో నీరు పారుదల తగ్గిపోయింది.

లోతట్టు ప్రాంతాలు ఇలా..

రెండు రోజులు పాటు ఏకధాటిగా వర్షం కురిస్తే పట్టణంలోని శివారు ప్రాంతాల్లో వర్షం నీరు చేరుతోంది. మున్సిపాలిటీలో 33 వార్డులుండగా ఎక్కువ వార్డులు శివారు ప్రాంతాల్లోనే ఉంటాయి. స్వర్ణ రోడ్డు, దండుబాట ప్రాంతాలతో పాటు రోశయ్య కాలనీ, ఐక్యనగర్, జయంతిపేట ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోతోంది. ఇటీవల పిడుగులతో కురిసిన భారీ వర్షానికి చీరాల మండలం కొత్తపాలెంలో లక్షన్నర రూపాయల విలువ గల రెండు ఎద్దులు మృతి చెందాయి. అలానే పాత చీరాల్లో పిడుగుపాటుకు ఒక గేదె మృతి చెందింది. అకాల వర్షాలకు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన పనులు నిమిత్తం బయటకు వచ్చే వారు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారస్తులు ఇలా అందరూ బాధితులే. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు కాలువలు పూడికలు ఎప్పటికప్పుడు తొలగిస్తే వర్షపునీరు పారుదలకు అవకాశం ఉంటుంది.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కృష్ణబాబు

బల్లికురవ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ధాన్యం, పొగాకు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదే విధంగా ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని జగన్‌కు చెప్పినట్లు కృష్ణబాబు తెలిపారు. పార్టీని బలోపేతం చేసి, కార్యకర్తలకు అండగా ఉండాలని తనతో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు కృష్ణబాబు తెలిపారు. హం సావత్ కిషోర్ నాయక్, తాళ్ల వెంకటరెడ్డి, జాన్‌డీర్ సుబ్బారెడ్డి, మక్కెనరవిబాబు, మూడావత్ హరి కృష్ణనాయక్, తదితరులున్నారు.

రైతుకు 'పొగ'బెట్టిన కూటమి



కేశవరప్పాడు గ్రామంలో తడిచిన పొగాకును ఆరబెట్టుకుంటున్న రైతులు

కేశవరప్పాడు (కారంచేడు): పొగాకు రైతులపై కూటమి ప్రభుత్వ పగబట్టింది. గత ఏడాది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో అందించిన గిట్టుబాటు ధరలతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అదే తరహాలో ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధరలుంటాయని ఆశించి సాగు చేయగా కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీరు చల్లింది. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు, గుణపాఠం చెప్పారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆరబెట్టిన పొగాకు తడిచిపోవడంతో వాటిని విడదీసి ఆరబెట్టుకుంటున్న రైతులను చూసి అంతా ఆవేదన చెందుతున్నారు. లక్షల రూపాయలతో సాగు చేస్తే పెట్టుబడులు కాదు కదా ఒక్కో ఎకరానికి కనీసం రూ. 50వేల నష్టం వచ్చే పరిస్థితులు దాపురించాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేశవరప్పాడు, కొడవలివారిపాలెం, తిమిడెదపాడు, యర్రంవారిపాలెం, నాయుడువారిపాలెం, పోతినవారిపాలెం, జరుబులవారిపాలెం, దగ్గుబాడు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల పరిధిలో రైతులంతా ఇదే దుస్థితిలో ఉన్నారు.

ఘనంగా వార్షిక తిరునాళ్ల



అలంకరణలో గణపతి శివుడు



స్వామి అమ్మవారి కల్యాణోత్సవం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసిన బాలా త్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి 15వ వార్షిక తిరునాళ్ల బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గూడూరు మోహనశర్మ నటరాజ్ ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచి ఆలయంలోని గణపతికి షోడషోపచార పూజలు, స్వామి ఆలమ్మవార్లకు పంచామృతాభిషేకం, అమ్మవారి కంకుమార్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. తరువాత స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉంచి వేదమంత్రోచ్చరణల మధ్య మూడు గంటల పాటు కమనీయంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అనేక మొక్కుబడి ప్రభలు, భారీ ఎలక్ట్రిక్ ప్రభ స్వామివారి సన్నిధి వద్ద ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

స్వర్ణమ్మకు పొంగళ్లు

కారంచేడు: గ్రామ దేవతగా భక్తుల కొంగు బంగారమైన స్వర్ణమ్మ తల్లికి భక్తులు, ఆడపడుచులు బుధవారం పెద్ద ఎత్తున పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరునాళ్ళు మరుసటి రోజున గ్రామానికి చెందిన భక్తులు ఈ పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు కుమారుడు మురళీకృష్ణ, గాయత్రి మూడో వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆశ్రమంలోని 30 మంది వృద్ధులకు భోజనంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. దీంతో పాటు ఆశ్రమంలోని వృద్ధులకు నాగబైరు శ్రీనివాసరావు మే నెల అంతటా వృద్ధులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య, కోట శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యచారి, ఆశ్రయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి పూజలు



చందన అలంకారంలో వీరాంజనేయస్వామి

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత శ్రీభావనాఋషి దేవస్థాన ప్రాంగణంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఉడతా భాస్కర పార్వతీశ్వరరావు, జి.వెంకటసుబ్బారావు బుధవారం తెలిపారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, తమలపాకులతో పూజ, హనుమాన్‌చాలిసా పారాయణం, సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. పట్టణంలోని బోస్‌నగర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం వీరాంజనేయస్వామికి చందనంతో అలంకారం చేశారు. అనంతరం అరటిపండ్లతో సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్తలు తెలిపారు. 24వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోండి

- అంబేద్కర్ జయంతి వేడుకలు అడ్డుకోవడం దారుణం

చినగంజాం: అంబేద్కర్ జయంతి వేడుక ఊరేగింపును అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గత ఏప్రిల్ నెల 14 న ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకల ఊరేగింపును అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిట్రగుంట గ్రామంలో దళిత యువత అంబేద్కర్ జయంతి రోజున ఆయన చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న తరుణంలో కొందరు అగ్రకులాలకు చెందిన వ్యక్తులు అడ్డుకొని అంబేద్కర్ ఊరేగింపును మీ పల్లెలో నిర్వహించుకోండి గ్రామంలోని రావటానికి వీలులేదంటూ అడ్డుకోవడం అమానుష చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై దళిత యువకులు జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు నెల రోజులు దాటినా పట్టించుకోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలో ఈ విధంగా జరిగితే పట్టించుకోవడం దారుణమన్నారు. కులవివక్షతో ఊరేగింపును అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి దళితులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజల ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయండి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలతో పాటు 5 సంవత్సరాల్లోపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా టీకాలను సక్రమంగా అందించాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు.

5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగులుప్పలపాడు: కారు ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బెల్లం ఆంజనేయులు మోటార్ సైకిల్‌పై ఉప్పుగుండూరు గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుంచి 216వ నంబర్ జాతీయ రహదారిపైకి ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో బాపట్ల వైపు నుంచి కావలి వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయి దానిపై ఉన్న బెల్లం ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.

25న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు చీరాల్లోని ఎస్‌ఆర్‌అండ్‌పీఎంఎ హైస్కూలు క్రీడా మైదానంలో సబ్‌జూనియర్స్, జూనియర్ బాల, బాలికల విభాగంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. విజయ్‌కుమార్, కోఆర్డినేటర్ ఎస్. దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బి. ప్రేమయ్య, కోచ్ ప్రసన్నకుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా ఎంపికలో పాల్గొనే ఆసక్తి కలిగిన క్రీడాకారులు సబ్‌జూనియర్స్ 1 జనవరి 2012 నుంచి 31 డిసెంబర్ 2013 మధ్య జన్మించినవారై ఉండాలని తెలిపారు. అదే విధంగా జూనియర్ విభాగంలో ఎంపిక కోసం హాజరయ్యే క్రీడాకారులు 1 జనవరి 2010 నుంచి 31 డిసెంబర్ 2011 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమవెంట వయస్సు నిర్ధారణ కోసం జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫుట్‌బాల్ ఇన్‌చార్జ్ ప్రేమయ్య 8309607343, కోఆర్డినేటర్ దేవదాసు 9490335238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

ఒంగోలు సిటీ: స్థానిక కర్నూలు రోడ్డు బైపాస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో జై రావు కళాబృందం వారు హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, టీబీ వ్యాధి లక్షణాలను పాటలు, నాటికల ద్వారా తెలియజేశారు. 1097 టోల్ ఫ్రీ గురించి చెప్పారు.

సూర్యఘర్‌తో విద్యుత్ వెలుగులు

యద్దనపూడి: సూర్యఘర్ పథకాన్ని గ్రామీణప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. గృహాల్లో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రాయితీని ఇస్తుందని అలాగే బ్యాంకుల ద్వారా కూడా రుణాలు కూడా పొందవచ్చన్నారు. సబ్సిడీ కోసం కరెంట్‌బిల్లు, ఇంటిపన్ను రసీదు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ తీసుకొని సచివాలయాల వద్ద కానీ , ఇంటర్‌నెట్ వద్ద కానీ వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



వెంకట్రావు మృతదేహం

అద్దంకి: గెండోపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన పట్టణంలోని భవానీ సెంటర్‌లో బుధవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన వెంకట్రావు(30) ఆటో నడుపుకుంటూ జీనం సాగిస్తుంటాడు. ఈక్రమంలో బుధవారం వెంకట్రావు తన ఆటోకు వెల్డింగ్ చేయించే పని కోసం పట్టణంలోని భవానీ సెంటర్‌లోని ఓ వెల్డింగ్ వర్కు దుకాణం వద్ద పని చేయిస్తూ.. ఆటోను పట్టుకుని ఒక్కసారిగా పడిపోయాడు. గుండెపోటు అయి ఉంటుందని గ్రహించిన మరో ఆటో డ్రైవర్ అతనికి పీసీఆర్ చేసి ఆటోలో వైద్యశాలకు తీసుకెళ్లాడు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

25న ప్రతిభా పురస్కారాలు

అద్దంకి: ఈ సంవత్సరం పదో తరగతి ఇంటర్మీడియెట్ ఐఐటీ, నీట్, ట్రిపుల్ నీట్ ద్వారా ద్వారా ఎంబీబీఎస్‌లో సీటు పొందిన విశ్వ బ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పట్టణ వాసీ చెన్నుపల్లి శ్రీనివాసాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఈ నెల 25న దర్శి వెంకటేశ్వర కళ్యాణ మండపంలో అభినందన, ప్రతిభా పురస్కారాల అందజేత కార్యక్రమాని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, డాక్టర్ కె. శ్రీనివాసులు, రాష్ట్ర ప్రభుత్వ బీసీ కమిషన్ సభ్యులు కుందుర్తి గురవాచారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి బాపట్ల జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారు బాబు, మండల విద్యాశాఖ అధికారి రాచగుండ్ల శ్రీనివాసులు, ప్రముఖ విద్యావేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. అర్హులైన 80 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉమ్మడి ప్రకాశంలోని మండలం జిల్లా రాష్ట్ర, స్థాయిలో ఉన్న సంఘ నాయకులు, విశ్వబ్రాహ్మణ సోదరి సోదరమణులు అందరూ హాజరై ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అదాలత్

బల్లికురవ: విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం ఊర్పూరులో ఉదయం 10.30 గంటలకు విద్యుత్ సమస్యలపై అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని కోరారు. వినియోగదారుల సమస్యలను వీలును బట్టి అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రిటైర్డ్ జడ్జి విక్టర్ ఇమ్మానియేల్, విద్యుత్ శాఖ ఉన్నత స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల్లో భాగంగా చీరాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి పల్లపోతు వెంకటనాగ సంతోష్ (2024–25 బ్యాచ్) పదో తరగతి ఫలితాల్లో 591 మార్కులు సాధించినందుకు గాను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదగా విశిష్ట షైనింగ్ స్టార్ అవార్డును మంగళవారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థకు మీరే బ్రాండ్ అంబాసిడర్‌లు అని సంబోధిస్తూ విద్యార్థులను ఆయన అభినందించారు. అలానే ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఫోన్ ద్వారా విద్యార్థికి అభినందనలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో బాపట్ల జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు పొందడానికి ఉపాధ్యాయుల సమష్టి కృషి అని, భవిష్యత్తులో ఎందరో ఉత్తమ విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడాలని ప్రిన్సిపాల్ జె.సరళ ఆకాంక్షించారు.